సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 16 । మే । 2023



పర్యావరణ పరిరక్షణకు కృషి
పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని యూ.చీడిపాలెం సెక్షన్ అధికారి సత్యనారాయణ అన్నారు. 8లో



యువకుడు దుర్మరణం
రాజవొమ్మంగి మండలం వైకుంఠపురం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. 8లో



అందాల తోవ.. కలువల ఆవ
కొండకర్ల ఆవ కొల్లేరు సరస్సు తర్వాత అంతటి పెద్ద మంచినీటి సరస్సు. కొండలు, కొబ్బరి చెట్లు ఆవకు ప్రత్యేక అందాన్ని చేకూర్చుతున్నాయి. 8లో

న్యూస్‌రీల్

గంగాలమ్మ తల్లికి వెండి పాదాలు


వెండి పాదాలు తొడుగుతున్న భక్తులు

మారేడుమిల్లి: గ్రామ దేవత మాతృశ్రీ కనకవర్షిణి గంగాలమ్మ తల్లికి కొవ్వూరుకు చెందిన కొదాటి వీర వెంకట సత్యనారాయణ దంపతులు సోమవారం వెండి పాదాలను బహూకరించారు. సుమారు ఆర కిలో వెండితో చేసిన పాదాలను ఆ దంపతులు అమ్మవారికి తొడిగారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి
మంగళవారం నుంచి శనివారం వరకు జరిగే మారేడుమిల్లి మాతృశ్రీ కనకవర్షిణి గంగాలమ్మ తల్లి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కర్రి లక్ష్మీశ్రీనివాసు రెడ్డి తెలిపారు. మారేడుమిల్లితోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాదిగా అమ్మవారి దర్శనానికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

23న దివ్యాంగులకు వైద్య శిబిరం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

చింతపల్లి: మండల కేంద్రంలో ది ఎబిలిటీ పీపుల్ ఆధ్వర్యంలో ఈనెల 23న దివ్యాంగుల కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. ఆరోగ్య సిబ్బంది,సచివాలయ ఉద్యోగులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎముకల సమస్యలతో బాధపడుతున్న వారి కోసం విశాఖనగర పాలక సంస్థ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వెన్నుపూస గాయపడిన వారికి, ఎముకల సమస్యలు ఉన్న వారికి అనుభవజ్ఞులైన వైద్యులు పరీక్షలు జరిపి, మెరుగైన పునరావాసం,కృత్రిమ అవయవాల వినియోగం వంటి వాటిపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య,కో–ఆప్షన్ సభ్యులు నాజర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–2024 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు చొప్పున ఉన్నాయని పేర్కొన్నారు. 2022–2023 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులని, ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూగురుకులమ్.ఏపీ. జీఓవీ.ఇన్ వెబ్‌సైటును చూడవచ్చని పేర్కొన్నారు. వివరాల కోసం 9490957248 అనే నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఐసీడీటీ కోర్సుల బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నూతనంగా నెలకొల్పిన ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్(ఐసీడీటీ) బ్రోచర్‌ని, కేంద్రం నుంచి అందిస్తున్న కోర్సుల వివరాలతో కూడిన ప్రత్యేక సంచికను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. డ్రోన్ టెక్నాలజీ రంగంలో సాంకేతిక, ఆవిష్కరణ, పరిశోధనల్లో పనిచేసే విధంగా విశ్వవిద్యాలయం, పరిశ్రమల సంయుక్త భాగస్వామ్యంలో ఈ కేంద్రం నెలకొల్పారు. కేంద్రం నుంచి అందించే కోర్సుల వివరాలను ఈ సందర్భంగా విడుదల చేశారు. కార్యక్రమంలో కేంద్రం సీఈవో ఎస్.కె.వి.సతీష్, ప్రాజెక్ట్ హెడ్ గిరిబాబు, సత్యనారాయణన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓ.ఆర్.ఎం. రావు, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ రేష్మ, సమన్వయకర్త హేమ తదితరులు పాల్గొన్నారు.

జన జాతర


పాడేరు మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

- ఉత్సవంలో రెండో రోజు మోదమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఘనంగా పూజలు
- ఆకట్టుకున్న పులివేషాలు


ఆకట్టుకున్న పులివేషాలు

సాక్షి,పాడేరు: అమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. పరుగుపరుగున ఆలయానికి చేరుకుని దేదీప్యమైన మోదమ్మ రూపాన్ని కనులారా వీక్షించి పరవశించిపోయారు... కాపాడమ్మా అంటూ ఆర్తిగా వేడుకున్నారు. తమ పిల్లాపాపలను చల్లగా చూడాలని కోరుకున్నారు. పాడేరు మోదకొండమ్మ ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన భక్తులు పాడేరుకు చేరుకుని మోదకొండమ్మతల్లిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసు అధికారులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలు,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు
పాడేరు మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు వద్ద కొలువుదీర్చిన మోదకొండమ్మతల్లి ఉత్సవ విగ్రహం, పాదాలు,ఇతర ఘటాలకు భక్తులు రెండవ రోజు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర,ఇతర కమిటీ ప్రతినిధులు,భక్తులు అమ్మవారి ఘటాలను పాడేర వీధుల్లో ఉరేగించారు.డప్పు వాయిద్యాలతో పాటు గరగల నృత్యాలు,పులివేషాలతో ఘటాల ఉరేగింపు సంబరం రాత్రి 8గంటల వరకు జరిగింది.ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పులివేషాలు ఆకట్టుకున్నాయి.

మోదమ్మకు సారె
మోదకొండమ్మతల్లికి పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కుటుంబాల వారు సోమవారం సారె, పసుపు,కుంకుమలు సమర్పించారు. మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు,ప్రతినిధి ఉప్పల రత్నం,వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ధర్మకర్త నవర గోవిందరావు,విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు వెంకటరమణ,సంఘ ప్రతినిధి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

వినోదాల సందడి
మోదకొండమ్మతల్లి ఉత్సవాలతో పాడేరు పట్టణంలో వినోదాల సందడి నెలకొంది. జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్.. జాతరకు వచ్చిన అన్ని వర్గాల భక్తులను అలరిస్తోంది.


మోదమ్మకు సారె,పూజాసామగ్రిని సమర్పిస్తున్న విశ్వబ్రాహ్మణుల కుటుంబాలు


సతకంపట్టు నుంచి అమ్మవారి ఘటాలను తీసుకు వస్తున్న పిన్నయ్యదొర

ఐటీడీఏ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పలువురు ఆసక్తిగా తిలకించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా,ఇతర వైద్య సిబ్బంది ఈస్టాల్‌లో భక్తులకు వైద్య సేవలు అందజేశారు.

భక్తులకు అన్నదానం
మోదకొండమ్మతల్లి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు మోదమణికంఠ అన్నదాన ట్రస్ట్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,డాక్టర్ నరసింగరావు దంపతులు రూ.50వేలు,మరికొంతమంది నగదు,నిత్యావసర సామగ్రి అన్నదానానికి అందజేశారు. అన్నదాన కార్యక్రమంలో మాడుగుల సీఐ సత్యనారాయణ, పోలీసు అధికారి రామారావు,మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు,రమాదేవి దంపతులు, ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు,అన్నదాన ట్రస్ట్ ప్రతినిధులు ముకుందురావు,శివరాత్రి శ్రీనివాసరావు,సిద్ధనాతి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవానికి హాజరైన జనం

మన్యంలో కొండలరాయుడు


ఐ.పోలవరం వద్ద నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయం

- ఐ.పోలవరం వద్ద రూ.6 కోట్లతో వెంకన్న ఆలయ నిర్మాణం
- 17న ఆలయ సంప్రోక్షణ, ప్రారంభం

రంపచోడవరం: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి మన్యంలో కొలువుదీరనున్నాడు. రంపచోడవరం సమీపంలో ఐ.పోలవరం జంక్షన్ సమీపంలో రూ.6 కోట్ల వ్యయంతో టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. కొండపై ఎంతో సుందరంగా ఆలయ నిర్మాణాన్ని తీర్చిదిద్దారు.

17న ప్రారంభం
ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఈనెల 17న ప్రారంభించేందుకు టీటీడీ అధికారులు సన్నాహాలు పూర్తిచేశారు. 17 నుంచి 22 వరకు మహా సంప్రోక్షణ నిర్వహిస్తారు. స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. ఏపీ టూరిజం పార్కు ఎదురుగా కొండపై నిర్మించిన ఈ ఆలయానికి రాకపోకలు సాగించేందుకు రహదారి, కొండపై వెళ్లేందుకు రహదారి పక్కనే ఫుట్‌పాత్ నిర్మించారు. టీటీడీ ఆధ్వర్యంలో మన్యంలో తొలిసారిగా వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఇటీవల టీటీడీ ఉన్నతాధికారులు ఆలయాన్ని సందర్శించి పనులు పరిశీలించారు. ప్రారంభ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్‌తో పాటు ఉన్నతాధికారులు హాజరయ్యే అవకాశముంది. హోమాలు నిర్వహించేందుకు ప్రత్యేక స్థలంతో పాటు ఐదు రోజుల పాటు జరిగే ప్రారంభ కార్యక్రమానికి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.


కొండపైకి వెళ్లేందుకు నిర్మించిన రహదారి

ఏయూ బీటెక్ పరీక్ష ఫలితాల విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చివరి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం సాయంత్రం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. రికార్డు సమయంలో కేవలం వారం రోజుల్లో ఫలితాలను అందించారు. రాష్ట్రంలో పరీక్షలు సకాలంలో నిర్వహించి, సత్వరం ఫలితాలను అందించిన తొలి విశ్వవిద్యాలయం ఏయూనే కావడం విశేషం. ఈ సంవత్సరం భారీగా ఏయూ విద్యార్థులు ఉపాధి అవకాశాలను సాధించారు. అదే విధంగా పెద్దసంఖ్యలో ఏయూ విద్యార్థులు విదేశీ విద్యను అభ్యసించడానికి వెళ్తున్నారు. వీరికి ఉపయుక్తంగా ఫలితాలను సకాలంలో విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్‌లు ఆచార్య డి.వి.ఆర్ మూర్తి, ఆచార్య సి.హెచ్.వి.వి భాస్కర రెడ్డి పాల్గొన్నారు.

జూన్ నుంచి రేషన్ కార్డుదారులకు గోధుమలు

కిలో రూ.10కే సరఫరా చేయనున్న పౌరసరఫరాల శాఖ

సాక్షి, విశాఖపట్నం : నిరుపేదల ఆరోగ్యంపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా గోధుమలు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఏపీ పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు జూన్ నుంచి రేషన్ కార్డుదారులకు గోధుమలు పంపిణీ చేయనున్నట్లు విశాఖ జేసీ విశ్వనాథన్ తెలిపారు. కిలో రూ.10 చొప్పున విశాఖ జిల్లాలోని 5,21,435 మంది బియ్యం కార్డుదారులకు ఒక్కొక్క కార్డుపై మూడు కేజీల వరకు గోధుమలు అందజేయనున్నట్లు వెల్లడించారు. బియ్యం, పంచదార మొదలైన రేషన్ సరకులతో పాటు గోధుమలు కూడా మొబైల్ రేషన్ వ్యాన్ల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు. రేషన్ దుకాణాల డీలర్లకు కిలోకి ఒక రూపాయి కమీషన్ అందిస్తున్నామని, అందరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి జి.సూర్యప్రకాష్ కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

జి.మాడుగుల: నుర్మతి సచివాలయం పరిధిలోని వాకపల్లి గ్రామంలో సోమవారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణులు ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. ప్రసవ సమయానికి ముందుగానే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరాలన్నారు. ఆస్పత్రుల్లో ప్రసవాల వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. శిబిరంలో 12మంది జ్వర పీడితుల రక్తపూతలు పరీక్షించగా, అందరికీ నెగిటివ్ వచ్చినట్టు చెప్పారు. ఈ వైద్య శిబిరంలో 62 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందు లు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీ పట్టాల పంపిణీకి అర్హుల గుర్తింపు వేగవంతం

కలెక్టర్ సుమిత్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో డీ పట్టాల పంపిణీకి అర్హుల గుర్తింపు, భూముల సేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. 22 మండలాల రెవెన్యూ, సర్వే అధికారులతో తన కార్యాలయం నుంచి సోమవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూముల రీసర్వే, డి.పట్టాలు జారీ చేసేందుకు భూముల గుర్తింపు, పీవీటీజీ ఓటర్ల నమోదు, ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. రెండు నెలల నుంచి 2502 గ్రామాలకు గాను 169 గ్రామాల్లో మాత్రమే భూములను గుర్తించారని చెప్పారు. జిల్లాలోని వీఆర్‌వోలు పనితీరు మార్చుకోవాలని, భూముల గుర్తింపులో జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. డి పట్టాల కోసం అర్జీదారులు మీ చుట్టూ తిరగాలా.. అంటూ రెవెన్యూ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములను రీసర్వే చేసే సమయంలో సంబంధిత షెడ్యూల్‌ను అటవీశాఖ అధికారులకు పంపించి, రీసర్వే సమాచారం అందించాలన్నారు. అందుకు అనుగుణంగా ఆ అధికారులు ఆదేశాలు జారీ చేస్తారని తెలిపారు. 293 గ్రామాల్లో వెక్టరైజేషన్ ప్రక్రియ జరుగుతోందని, 250 గ్రామాల్లో పూర్తయ్యిందని చెప్పారు. 240 గ్రామాల్లో సర్వే డేటా అప్‌లోడ్ చేయాలని అన్నారు. డేటా నమోదు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఫారం 7,10 సేకరణ త్వరితగతిని చేయాలన్నారు. పెండింగ్ మ్యుటేషన్లపై రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలని,మ్యుటేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తే రైతులు రైతు భరోసా పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. వీఆర్‌వోలు సక్రమంగా పనిచేయకపోతే జీతాలు నిలుపుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాసు, ఇన్‌చార్జి పాడేరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఆర్‌వో పి.అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ జాబ్‌కార్డులు
జిల్లాలోని అర్హులందరికీ జాబ్‌కార్డులు అందజేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. 22 మండలాల ఎంపీడీవోలు, డ్వామా అధికారులతో సోమవారం వీడియో సమావేశం నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. జీకే వీధి, చింతపల్లి మండలాల్లో జాబ్‌కార్డులు అధికంగా ఉన్నప్పటికీ పనులు తక్కువగా ఉన్నాయని, అందరికీ పనులు కల్పించాలని సూచించారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఆధార్ సీడింగ్ చేయాలని ఆదేశించారు. పిల్లల ఆధార్ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎనీమియాతో బాధపడే చిన్నారులను గుర్తించాలని, జననీ సురక్ష యోజన పథకంలో తల్లులకు బ్యాంకు ఖాతాలను ప్రారంభించాలని, అన్ని సచివాలయాల్లో రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. జేసీ శివశ్రీనివాస్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవ, డ్వామా పీడీ రమేష్‌రామన్ తదితరులు పాల్గొన్నారు.

అడవిలో మంటలు

- ఘాట్ రోడ్డులో వ్యాపించిన పొగ
- తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రయాణికులు


కాలిన చెట్లు


ఘాట్ రోడ్డు సమీపంలో వ్యాపించిన మంటలు

రంపచోడవరం: జిల్లాలోని మారేడుమిల్లి, చింతూరు అటవీ డివిజన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగడంతో ఘాట్ రోడ్డులో పొగ అలుముకుంది. ఘాట్‌రోడ్డుకు అనుకుని ఉన్న అటవీప్రాంతంలో ఆకతాయిలు నిప్పు అంటించడంతో కొండ దిగువ నుంచి పైవరకు మంటలు వ్యాపించాయి. మంటలను ఆర్పే అవకాశం కూడా లేకుండాపోయింది. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో పాటు ఘాట్ రోడ్డులో పొగ కమ్మేసింది. దీంతో ఆ రోడ్డులో ప్రయాణించిన వాహనచోదకులు ఊపిరి తీసుకునేందుకు ఇబ్బంది పడ్డారు. దట్టంగా పొగ కమ్మేడంతో వాహనచోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. మంటల్లో విలువైన అటవీ సంపద కాలిపోయింది. వేసవిలో అటవీప్రాంతంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. వీటి నివారణకు అటవీ శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. ఘాట్ రోడ్డులో ప్రయాణించే వారు నిప్పు అంటించడమో, కాల్చి పడేసిన సిగరెట్ వలనో ఇలాంటిప్రమాదాలు జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి అడవి తగలబడుతూనే ఉంది.

ఆర్టీసీలో బ్రేక్ జర్నీ!



- దూరప్రాంతాలకు వెళ్లే వారికి సౌలభ్యం
- ఒకే టిక్కెట్టుతో ప్రయాణించేందుకు అవకాశం
- 2 నుంచి 22 గంటల వరకు లే అవర్ చాన్స్
- అందుబాటులోకి మల్టీ సిటీ టికెటింగ్ విధానం
- ఉత్తరాంధ్ర నుంచి పలు నగరాలకు కనెక్టివిటీ సదుపాయం

సాక్షి, విశాఖపట్నం: ఇన్నాళ్లూ విమాన ప్రయాణికులకు మాత్రమే పరిమితమైన బ్రేక్ జర్నీ సదుపాయం ఇప్పుడు ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం దూర ప్రాంతాలకు వెళ్లే వారు బస్సు మారిన ప్రతిసారీ టిక్కెట్టు తీసుకోవలసి వస్తోంది. ఇకపై అలాంటి అవసరం లేకుండా మల్టీ సిటీ టికెటింగ్ సౌలభ్యాన్ని ఆర్టీసీ కల్పించింది. ఏదైనా పట్టణం నుంచి దూరప్రాంతంలో ఉన్న మరో పట్టణానికో లేదా నగరానికో వెళ్లడానికి నేరుగా బస్సు సదుపాయం ఉండడం లేదు. ఇలాంటి వారు తామెళ్లబోయే ప్రాంతానికి ఎక్కడ నుంచి బస్సు సౌకర్యం ఉందో అక్కడకు చేరుకోవలసి వస్తోంది. ఇకపై తాము బయలుదేరే చోట నుంచే గమ్యస్థానానికి ఆన్‌లైన్ ద్వారా ఒకేసారి నేరుగా టిక్కెట్టు పొందవచ్చు. ఉదాహరణకు పార్వతీపురం నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే డైరెక్ట్ ఆర్టీసీ బస్సు సర్వీసు లేదు. ఈ ప్రయాణికులు విశాఖకు ఓ బస్సులో వచ్చి హైదరాబాద్ బస్సుకు మరోసారి టిక్కెట్టు తీసుకోవలసి వస్తోంది. ఇది వ్యయ ప్రయాసలతో కూడుకుంటోంది. అంతేకాదు.. వీరు ఎక్కిన ప్రతి బస్సులోనూ రిజర్వేషన్ కోసం కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ మల్టీ సిటీ టికెటింగ్ విధానంలో తామెళ్లే బస్సుల్లో ఒకే రిజర్వేషన్ చార్జీతో ప్రయాణించే వీలుంటుంది. మారే బస్సులోనూ ముందుగానే సీటు రిజర్వ్ అయి ఉంటుంది. ఆర్టీసీ కొత్తగా ప్రవేశపెట్టిన ఈ విధానంలో ప్రయాణికుడు తన గమ్యస్థానానికి వెళ్లడానికి బ్రేక్ జర్నీ సదుపాయం ఉంది. తానెళ్లే బస్సు కోసం కనీసం 2 నుంచి గరిష్టంగా 22 గంటల వరకు వేచి ఉన్నా బ్రేక్ జర్నీలో ఆ టిక్కెట్టు చెల్లుబాటు అవుతుంది. ఒకవేళ తొలి బస్సులో వెళ్లే వారి బస్సు మార్గం మధ్యలో ఆగిపోతే వెంటనే ఆ ప్రయాణికుడిని మరో బస్సులో పంపించి ప్రయాణానికి ఆటంకం లేకుండా చూస్తారు.

ఉత్తరాంధ్ర నుంచి ఇలా..
ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశాఖపట్నం మినహా ఇతర చోట్ల నుంచి దూర ప్రాంతాలకు నేరుగా ఆర్టీసీ బస్సు సదుపాయం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని విశాఖ సహా శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం, పాడేరు తదితర ప్రాంతాల నుంచి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, తిరుపతి, ఒంగోలు, శ్రీశైలం, విజయవాడలకు మల్టీ సిటీ టికెటింగ్ (బ్రేక్ జర్నీ) సదుపాయాన్ని కల్పించారు.

ఉత్తరాంధ్ర నుంచి మల్టీ సిటీ టికెటింగ్ సదుపాయం ఇలా..

బయలుదేరే చోటు	వయా/బ్రేక్ జర్నీ	గమ్యస్థానం
శ్రీకాకుళం	విశాఖపట్నం	హైదరాబాద్
శ్రీకాకుళం	విశాఖపట్నం	శ్రీశైలం
శ్రీకాకుళం	విశాఖపట్నం	ఒంగోలు
విశాఖపట్నం	రాజమండ్రి	బెంగళూరు
విశాఖపట్నం	కాకినాడ	చెన్నై
పార్వతీపురం	విశాఖపట్నం	హైదరాబాద్
పార్వతీపురం	రాజమండ్రి	బెంగళూరు
విజయనగరం	విశాఖపట్నం	హైదరాబాద్
కొత్త ప్రతిపాదనలు ఇలా..		
పాడేరు	రాజమండ్రి	తిరుపతి
పాడేరు	తుని	విజయవాడ
పార్వతీపురం	విశాఖపట్నం	శ్రీశైలం
విజయనగరం	విశాఖపట్నం	శ్రీశైలం
శ్రీకాకుళం	విశాఖపట్నం	శ్రీశైలం

విస్తృత ప్రచారం చేస్తాం..



ఆర్టీసీ యాజమాన్యం అందుబాటులోకి తెచ్చిన మల్టీ సిటీ టికెటింగ్ సదుపాయంపై ప్రయాణికుల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై కరపత్రాలు ముద్రించి పంచుతాం. టిక్కెట్టు కౌంటర్లలోనూ తెలియజేస్తాం. అక్కడ పోస్టర్లను కూడా అతికిస్తాం. కొత్త విధానంలో ప్రయాణికులు బ్రేక్ జర్నీకి వీలుంటుంది. బస్సు మారిన ప్రతిసారీ రిజర్వేషన్ చార్జీ చెల్లించే అవసరం ఉండదు. బస్సు మారే చోట్ల మళ్లీ టిక్కెట్టు కోసం వేచి ఉంటూ సమయం వృథా కాదు. ఈ సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.
– సి.రవికుమార్, జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

• మోదకొండమ్మ తల్లి ఉత్సవాల చిత్రాలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


జాతరలో ఏర్పాటుచేసిన ఐసీడీఎస్ స్టాల్


అన్నసమారాధనలో భక్తులు


ఎగ్జిబిషన్‌లో చిన్నారుల సందడి


వైద్య ఆరోగ్య శాఖ స్టాల్‌లో గిరిజనులకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది


సమాచార శాఖ ఏర్పాటుచేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న గిరిజనుడు

అందాల తోవ.. కలువల ఆవ

- కొండకర్ల ఆవలో రూ.20 లక్షలతో ఫ్లోటింగ్ జెట్టీ పునరుద్ధరణ
- సందర్శకులు, మత్స్యకారులకు ఉపయుక్తం
- ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే కన్నబాబురాజు చొరవతో నిధులు మంజూరు
- 20 రోజుల్లో సిద్ధం చేసిన అధికారులు


కొండకర్ల ఆవ ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం (రబ్బరు వంతెన)

సాక్షి, అనకాపల్లి: కొండకర్ల ఆవ కొల్లేరు సరస్సు తర్వాత అంతటి పెద్ద మంచినీటి సరస్సు. కొండలు, కొబ్బరి చెట్లు ఆవకు ప్రత్యేక అందాన్ని చేకూర్చుతున్నాయి. సైబీరియా తదితర దేశాల నుంచి పక్షులు ఇక్కడకు వలస వస్తాయి. అది ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. సరస్సులో అందమైన కలువ పువ్వులు.. రంగు రంగుల పక్షులు... వీటి మధ్యలో బోటింగ్... సందర్శకులకు మధురానుభూతి కలిగిస్తుంది. గతంలో ఆవలో తాటి దోనెలపై విహరించేవారు. కొత్తగా బోట్లు ఏర్పాటు చేశారు. వాటి పైకి ఎక్కేందుకు ఆవ గట్టు మీదుగా వెళితే ఇబ్బంది కలుగుతుందని కొన్ని సంవత్సరాల క్రితం ఫ్లోటింగ్ జెట్టీ (రబ్బరు వంతెన) ఏర్పాటు చేశారు. హుద్‌హుద్ తుపానుతో ధ్వంసమైన ఫ్లోటింగ్ జెట్టీ పునరుద్ధరణకు ఇటీవల ఎంపీ డాక్టర్ సత్యవతి వినతి మేరకు జిల్లా కలెక్టర్ వీఎంఆర్డీఏ నిధులు మంజూరు చేయించారు. రూ.20 లక్షలతో చేపట్టిన ఈ నిర్మాణం కేవలం 20 రోజుల్లో పూర్తయింది. మరో రెండు రోజుల్లో ప్రారంభానికి కూడా సిద్ధమైంది. మత్స్యకారులు బోట్లను దించుకోవడానికి.. లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకోవడానికి కూడా ఇది అనువుగా ఉంటుంది. ఇక్కడ పిల్లల పార్కును ఆనుకొని గోడ నిర్మించనున్నారు. తద్వారా బోటుపై ప్రయాణించే వారికి మంచి వెసులుబాటు కలగనుంది.

పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రబ్బరు వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గతంలో చాలాసార్లు అప్పటి ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా ఉపయోగం లేకపోయింది. మూడు నెలల క్రితం కొండకర్ల ఆవ మాజీ సర్పంచ్ దుంగా వెంకటరమణ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజుకు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ బోటింగ్ చేసే సమయంలో, మత్స్యకారులు వేటకు వెళ్లే సమయంలో ఉపయుక్తంగా ఉండేలా వేసిన రబ్బరు వంతెన శిథిలావస్థకు చేరుకుందని, ఇబ్బందులు పడుతున్నామని విన్నవించడంతో కన్నబాబురాజు ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి దృష్టికి వెళ్లారు. వెంటనే ఎంపీ వీఎంఆర్‌డీఏ చైర్మన్, విశాఖ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునతో మాట్లాడారు. రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించారు.

ఆవ ప్రత్యేకతలివి..



- 1800 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొండకర్ల ఆవ వాస్తవానికి అచ్యుతాపురం-మునగపాక మండలాల సరిహద్దులో ఉంది. దీంతో అచ్యుతాపురం మండలం తరపున కొండకర్ల ఆవగా, మునగపాక మండలం తరపున వాడ్రాపల్లి ఆవగా పిలుస్తుంటారు. ఈ రెండు గ్రామాల మధ్య చేసే ఆవ విహారమే హైలైట్‌గా నిలుస్తుంది.
- రోజుకు సగటున ఇక్కడకు 100 మంది వరకు సందర్శకులు వస్తారు. వీకెండ్స్‌లో అయితే ఆ సంఖ్య రెట్టింపు అవుతుంది.
- ఈమధ్య కాలంలో ప్రీ వెడ్డింగ్ షూట్స్, లఘు చిత్రాల షూటింగ్స్ ఎక్కువగా జరుగుతున్నాయి.

రూ.25 లక్షలతో వ్యూ పాయింట్

అచ్యుతాపురం (అనకాపల్లి): వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న కొండకర్ల ఆవను వీక్షించేందుకు వ్యూ పాయింట్‌ను నిర్మించనున్నారు. రూ.25 లక్షలతో ఏర్పాటు చేయనున్న వ్యూపాయింట్ ద్వారా ఆవ మొత్తాన్ని వీక్షించవచ్చు. పక్షుల కిలకిలలు, కొండలు, ఆవలోని రకరకాల పూల అందాలను వీక్షించే వ్యూపాయింట్ ప్రత్యేక ఆకర్షణ కానుందని పర్యాటక శాఖ ఏఈ సీతారాం చెప్పారు. ఆవలోని అందాలను వీక్షించాలనే వారి కోసం ప్రత్యేకమైన యాప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ యాప్‌లో ఆవలోని ప్రత్యేకతలను పర్యాటకులు ఎక్కడి నుంచైనా తెలుసుకోవచ్చు. రిమోట్ సెన్సింగ్, జీపీఎస్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆవ సరిహద్దుల్ని గుర్తించనున్నారు. చిత్తడి నేలల పరిరక్షణకు స్నేహపూర్వక-పర్యాటక పరిరక్షణ రిజర్వ్ కమిటీని కూడా నియమించారు. చిత్తడి నేల సంరక్షణ కమిటీ ద్వారా అటవీ శాఖ రంగంలోకి దిగి వ్యవసాయం, ఉద్యానవనం, నీటిపారుదల శాఖ, పర్యాటక రంగాలను కలుపుకొని పర్యాటకులకు మంచి అనుభూతిని మిగల్చనుంది. స్థానిక మత్స్యకారుల ఉపాధికి దెబ్బ తగలకుండా చేపల పెంపకానికి, బోట్లను తిప్పడంలోనూ మత్స్యకారులకే అవకాశం కల్పించనున్నారు.

ఎమ్మెల్యే, ఎంపీలకు ధన్యవాదాలు



మా విన్నపాన్ని మన్నించి కేవలం మూడు నెలల వ్యవధిలోనే నిర్మాణం చేపట్టారు. రబ్బరు వంతెన శిథిలావస్థకు చేరడంతో చాలా ఇబ్బందులకు గురయ్యాం. ఎమ్మెల్యే కన్నబాబురాజు, ఎంపీ సత్యవతిల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేయించి ఈ నిర్మాణాన్ని కేవలం 20 రోజుల్లో పూర్తి చేశారు. మా గ్రామం నుంచి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

–దుంగ వెంకట రమణ, మాజీ సర్పంచ్, కొండకర్ల ఆవ

వేట సమయంలో ఉపయోగకరం



రబ్బరు జెట్టీని నిర్మించడం చాలా సంతోషంగా ఉంది. సుమారు 100 మత్స్యకార కుటుంబాలకు వేట సమయంలో ఉపయోగపడుతుంది. ప్రభుత్వానికి, అధికారులకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

–ఎస్.రమణబాబు, మత్స్యకారుడు. కొండకర్ల ఆవ

రెండు రోజుల్లో ప్రారంభిస్తాం

వీఎంఆర్‌డీఏ నిధులతో ఈ జెట్టి నిర్మాణం చేపట్టాం. ముంబాయికి చెందిన కన్‌స్ట్రక్టర్‌తో ఇది నిర్మించాం. ప్లాస్టిక్‌తో చేసిన ఈ జెట్టీ పరికరాలను ముంబాయి నుంచి తీసుకొచ్చి ఇక్కడ ఏర్పాటు చేశాం. నిర్మాణం పనులు పూర్తయ్యాయి. మళ్లీ ఒకసారి పరిశీలించి రెండు రోజుల్లో ప్రారంభిస్తాం.

– రవిశంకర్, అసిస్టెంట్ ఇంజినీర్, వీఎంఆర్‌డీఏ

పర్యావరణ పరిరక్షణకు కృషి


అడ్డతీగల అటవీశాఖ కార్యాలయం వద్ద శుభ్రపరుస్తున్న అటవీ సిబ్బంది

కొయ్యూరు: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని మర్రిపాకల రేంజ్ యూ.చీడిపాలెం సెక్షన్ అధికారి వి.సత్యనారాయణ అన్నారు. పర్యావరణానికి అనుకూలంగా జీవన మార్గం(లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) కార్యక్రమాన్ని సోమవారం యూ.చీడిపాలెంలో ప్రారంభించారు. గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్లే కలిగే అనర్థాలను వివరించారు. వచ్చేనెల 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. గ్రామాల్లో అవగాహన ర్యాలీలను నిర్వహించనున్నట్టు చెప్పారు.

అడ్డతీగల: పర్యావరణహిత జీవన శైలిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని అడ్డతీగల ఇన్‌చార్జి అటవీక్షేత్రాధికారి ఎం.అబ్బాయిదొర అన్నారు.పర్యావరణ జీవనశైలి(మిషన్ లైఫ్) కార్యక్రమంలో భాగంగా స్థానిక అటవీశాఖ కార్యాలయం వద్ద సిబ్బందితో కలిసి సోమవారం చుట్టు పక్కల పరిసరాలను శుభ్రపరిచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటోందని, దీంతో జీవవైవిధ్యానికి హాని కలుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజి అధికార్లు కె.రాజారావు,సీహెచ్.సత్యనారాయణ, సెక్షన్ అధికారులు కె.బాపిరాజు,బీటు అధికారులు,బేస్ క్యాంప్ హెల్పర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు గాయాలు


గాయపడిన నవీన్‌కుమార్

చింతపల్లిరూరల్: మండలంలోని చౌడుపల్లి వద్ద సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చౌడుపల్లి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ లోచల నవీన్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విధి నిర్వహణలో భాగంగా చింతపల్లి నుంచి చౌడుపల్లికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నవీన్ కుమార్‌కు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేసినట్టు డాక్టర్ లావణ్య తెలిపారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

మాకవరపాలెం: గంజాయి తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేశామని ఎస్‌ఐ రామకృష్ణారావు సోమవారం తెలిపారు. తెలంగాణకు చెందిన ఇద్దరు మైనర్లతోపాటు కిరణ్ దమాయ్(20), అల్లూరి సీతారామరాజు జిల్లా దారకొండకు చెందిన కొర్రా కల్యాణ్(28) గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో మండలంలోని కొండలఅగ్రహారం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో ఆర్టీసీ బస్సులో వీరు తరలిస్తున్న 650 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చిన్నారి క్యాన్సర్ చికిత్స కోసం పేద కుటుంబం వేడుకోలు


చికిత్స పొందుతున్న సూర్యతేజ


నగదు అందజేస్తున్న మల్లేష్ తదితరులు

కొయ్యూరు: క్యాన్సర్‌తో బాధపడుతున్న గిరిజన బాలుడు కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ అండగా నిలిచింది. అల్లూరి గిరి యువ సేవా సంఘానికి చెందిన టి.మల్లేష్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి నగదు అందజేశారు. సామర్లకోటలో ఉంటున్న కె.సూర్యతేజ (9) క్యాన్సర్‌తో బాధపడుతున్నారని ఉపాధ్యాయుడు నర్సింగ్ ద్వారా సమాచారం తెలుసుకున్న మల్లేష్, అతని స్నేహితులు 43 మంది కలిసి సేకరించిన రూ.20వేలను చిన్నారి కుటుంబానికి అందజేశారు. మల్లేష్ మాట్లాడుతూ సూర్యతేజ క్యాన్సర్ బారిన పడడం బాధాకరమన్నారు. ఆయన కోలుకోవాలని కోరుతూ ఆర్థిక సాయం చేశామన్నారు. పేద కుటుంబానికి చెందిన చిన్నారి చికిత్స కోసం దాతలు ముందుకొచ్చి సాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఇద్దరికి గాయాలు


ప్రమాద స్థలంలో రాజారమేష్ మృతదేహం

రాజవొమ్మంగి: మండలంలోని వైకుంఠపురం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సామర్లకోటకు చెందిన కొప్పిశెట్టి త్రినాథ రాజారమేష్ (25) మండలంలోని వణకరాయి గ్రామం నుంచి తన అక్క అనూరాధ, మేనకోడలు ప్రవల్లికను బైక్‌పై సామర్లకోట తీసుకువెళుతుండగా వైకుంఠపురం వద్ద ఎదురుగా ఏలేశ్వరం వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు, బైకు ఢీకొన్నాయి. రాజారమేష్ సంఘటనాస్థలంలో మృతి చెందాడు. ప్రవల్లిక, అనూరాధ గాయపడ్డారు. వీరికి జడ్డంగి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం ఏలేశ్వరం సీహెచ్‌సీకి రిఫర్ చేశారు. అనూరాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, రాజారమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి అడ్డతీగల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. రాజారమేష్ పెద్దాపురంలోని ఓ రైస్ మిల్లులో పనిచేస్తున్నాడు. అక్క అనూరాధను ఆమె అత్తవారి గ్రామమైన వణకరాయి నుంచి స్వగ్రామం సామర్లకోట తీసుకొని వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది.

లక్కవరంలో 5 పశువుల పాకలు దగ్ధం


ప్రమాదంలో ఎగసిపడుతున్న మంటలు

చోడవరం రూరల్: మండలంలోని లక్కవరం గ్రామంలోని మిడతాడ వారి కళ్లాల్లో ఆదివారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో ఐదు పశువుల పాకలు, వరి గడ్డివాములు, ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంలో చిక్కుకున్న పాడిపశువు మృతి చెందింది. ప్రమాదంలో రూ.1.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా. అర్ధరాత్రి 11 గంటల సమయంలో మిడతాడ వెంకటరమణ, వేచలపు సూర్యనారాయణ, మిడతాడ ముత్యాలనాయుడు, వేచలపు తాతబాబులకు చెందిన పశువుల పాకలకు నిప్పంటుకుని మంటలు ఎగిసాయి. గ్రామం నుంచి పలువురు గ్రామస్తులు చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ప్రమాద తీవ్రత అధికంగా కావడంతో చోడవరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ పి.వి.రామస్వామి, లీడింగ్ ఫైర్‌మన్ ఎస్.ప్రసాద్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శీరం రెడ్డి వెంకటరమణ సహాయ సహకారం అందించారు.

కాంట్రాక్ట్ కార్మికుడి మృతి


మృతుడు శంకర్ దాస్

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో ఠాగూర్ పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందాడని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. మృతుడు బీహార్‌కు చెందిన శంకర్‌దాస్ (50)గా గుర్తించారు. సీఐ అందించిన వివరాల ప్రకారం ఠాగూర్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న శంకర్ దాస్ సోమవారం ఉదయం 6 గంటలకు విధులకు వచ్చి బ్రాయిలర్ వద్ద బొగ్గు, కలప అందిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా మధ్యాహ్నం మృతి చెందాడని సీఐ చెప్పారు. పరిశ్రమ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఇదిలావుండగా మృతి చెందిన శంకర్‌దాస్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

చిక్కడు దొరకడు షూటింగ్ ప్రారంభం


షూటింగ్ ప్రారంభిస్తున్న దృశ్యం


చిక్కడు దొరకడు చిత్రంలోని సన్నివేశం

మునగపాక: వర్ధమాన దర్శకుడు కోరుకొండ గోపీకృష్ణ దర్శకత్వంలో సోమవారం కొత్త చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. మునగపాక శివాలయంలో కొబ్బరికాయ కొట్టి ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. వీఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌పై తీస్తున్న ఈ చిత్రానికి విజయలక్ష్మి రాజ్‌కిరణ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. రచన విల్లూరి జగ్గప్పారావు, సంగీతం ఎంఎల్ రాధ అందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన తారాగణంతోపాటు జబర్దస్త్ కళాకారులు ఈ చిత్రంలో నటిస్తున్నారు. జూలైలో చిత్రం విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. షూటింగ్‌ను తిలకించేందుకు స్థానికులు తరలివచ్చారు. కలియుగ భగవాన్‌లో నటించిన ప్రధాన పాత్రధారి కోటీశ్వరశర్మపై పలు సన్నివేశాల చిత్రీకరించారు.

నేడు జాబ్ మేళా

మురళీనగర్(విశాఖ ఉత్తర): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం ఓల్డ్ ఐటీఐలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తామని సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య, ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ డా. శ్రీకాంత్ తెలిపారు. ఐటీ కంపెనీలైన డబ్ల్యుఎన్‌ఎస్, ఫిన్‌సోల్‌తో పాటు యాక్ట్ ఫైబర్‌నెట్ కంపెనీలో 150 పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ, పూర్తి చేసిన ఉత్తరాంధ్రలోని యువత దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అర్హతల ఆధారంగా నెలకు రూ.10,000 నుంచి రూ.20,000 వరకు జీత భత్యాలు ఉంటాయని, దువ్వాడ సెజ్‌లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. వయోపరిమితి 18 నుంచి 35 ఏళ్లుగా నిర్ణయించినట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 92925 53352 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి రాక నేడు

మహారాణిపేట: కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కారడ్ మంగళవారం విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఉదయం 7 గంటలకు విశాఖ చేరుకొని నేరుగా సర్క్యూట్ హౌస్‌కు వెళ్తారు. 10 గంటలకు పోర్టు కళావాణి స్టేడియంలో జరిగే రోజ్‌గార్ మేళాలో మంత్రి పాల్గొంటారు. ఉదయం 11.30 గంటలకు హోటల్ దసపల్లాలో జరిగే స్టేట్ లెవెల్ బ్యాంకర్ల సమావేశానికి హాజరవుతారు. సాయంత్రం 4.35 గంటలకు విమానంలో విజయవాడ వెళ్తారు.

స్వయం ఉపాధి కల్పనకు రుణ సదుపాయం


మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ ఏడీ జోగినాథ్

కోటవురట్ల / కశింకోట: ప్రధానమంత్రి స్వయం ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) కింద 18 ఏళ్లు నిండిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించుకోవడానికి బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ సహాయక సంచాలకుడు జి.జోగినాథ్ వెల్లడించారు. కశింకోటలోని వెలుగు కార్యాలయంలో గ్రామ స్వయం సహాయక సంఘాల సహాయకులు (వీఓఏ)లతో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. యువత నెలకొల్పే యూనిట్‌ను అనుసరించి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాన్ని పొందవచ్చునన్నారు. అర్హులు ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రం, పంచాయతీలో జనన ధ్రువీకరణ పత్రం నకళ్లతో గ్రామాల్లో సంబంధిత వీఓఏలకు గాని, కశింకోటలోని వెలుగు కార్యాలయంలోగాని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏరియా కో–ఆర్డినేటర్ వి.ధర్మారావు, ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, కార్యదర్శి అప్పలనరసమ్మ, వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.